# సంకెళ్లు

సయ్యద్ సలీం

95886 30243

ఫరీదా కాళ్లీడ్చుకుంటూ మెల్లగా నడుస్తున్నది. ఆలోచనలు మాత్రం మిస్సైల్స్‌లా దూసుకొస్తూ.. భయంకరమైన శబ్దంతో మెదడును ఛిద్రం చేస్తున్నాయి. ఒంట్లోని రక్తమంతా ఏ డ్రాకులానో చివరి బొట్టువరకూ పీల్చేసినట్టు మొహమంతా పాలిపోయి.. బలహీనమైన ఆడశరీరంలా రూపాంతరం చెందిన విషాదం నడుస్తున్నట్టు..

దూరంగా రైలుపట్టాలు కనిపించాయి. సమాంతరంగా ప్రవహిస్తున్న రెండు చేతులు చాచి, తనను మృత్యుకౌగిలిలో బంధించడానికి ఎదురుచూస్తున్న రైలుపట్టాలు. బాధల నుంచి, కష్టాల నుంచి తనకు శాశ్వతంగా విముక్తి ప్రసాదించే లోహపు ఉరితాళ్లలా ఊరిస్తున్న పట్టాలు.

ఆమె వేగం పెంచింది. తొందరగా చచ్చిపోవాలన్న ఆరాటం! ఆలస్యమైతే మనసు మారుతుందేమోనన్న భయం. అలా జరిగితే మళ్లీ అజహర్‌తో కాపురమనే నరకంలోకి వెళ్లాల్సి వస్తుందన్న ఆలోచనకే ఒళ్లు జలదరించింది. చిన్నప్పుడు దోజఖ్ గురించి చదివినప్పుడు ఎంత భయమేసిందో! చనిపోయాక పాపులను శిక్షించడానికి నిర్దేశించిన స్థలం దోజఖ్. కానీ, అజహర్‌తో నిఖా జరిగాక అంతకన్నా భయంకరమైన దోజఖ్‌ను తను బతికున్నప్పుడే అనుభవించింది.

* * *

చిన్నప్పుడు తమ్ముడు స్కూల్‌కు వెళ్లడం చూసి..

''నేనూ చదువుకుంటాను అబ్బాజాన్'' అంటే..

''ఆడపిల్లవు.. నీకెందుకు చదువు? అమ్మ దగ్గర ఉర్దూ, అరబ్బీ నేర్చుకో చాలు'' అన్నాడు.

అమ్మ తనకు మద్దతు ఇస్తుందనుకుంటే.. ఆమె తన కంటి చెమ్మ కనిపించకుండా, తలొంచుకుని లోపలికి వెళ్లిపోయింది. పదహారేళ్లు నిండకుండానే తనకు అజహర్‌తో నిఖా చేయబోతున్నట్టు నాన్న చెప్పినపుడు..

''అప్పుడే పెళ్లేంటి అబ్బాజాన్? నేనింకా చిన్నపిల్లనేగా''.. అంటూ ఎంత ఏడ్చిందో!



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.